# సింగిల్ పేజీ కథలు

## గ్లామర్

విశ్వనాథరావు కాలేజీ ప్రిన్సిపాల్. ఆయనంటే స్టూడెంట్స్‌కే కాదు, వాళ్ల తల్లిదండ్రులకు కూడా హడలే. ఫ్యాషన్లు, పైలాపచ్చీసులు, పిచ్చివేషాలూ అతనికి గిట్టవు. అటువంటి వేషాలేసే స్టూడెంట్స్‌ని తన రూంకి పిలిచి మరీ చివాట్లు వేస్తాడు. 'ఇంకా వినకపోతే వాళ్లని కన్నవాళ్లని పిలిపించి చెప్పి బాబోయ్ అనిపించిగాని నిద్రపోడు.

ఆంగ్లభాషోపన్యాసకుడిగా విశ్వనాథరావుకి ఆంగ్లభాష మీద ఆంగ్లేయుడికి మించిన కమాండ్ వుంది. ఆయన ఫైనల్ ఇయర్‌కెళ్లి కీట్స్ పొయిట్రీ చెప్పి తన ఆఫీసు రూంకి తిరిగొస్తూంటే వరండాలో తుల్య ఎదురైంది.

తుల్య హిస్టరీ లెక్చరర్. చాలా చరిత్రల మీద పరిశోధనలు చేసిందిగానీ పరిశోధనావ్యాసాన్ని మాత్రం పదిలంగా తన అనుభవాల్లోనే పదిలపరుచుకుంది.

తుల్య విశ్వనాథరావుగారి అర్థాంగి.

తనో స్కానర్ మిషన్లా ఆమెను చూశాడు. అదే కాలేజీలో ఇంకా అయిదుగురు లేడీ లెక్చరర్స్ తనముందు తిరుగుతున్నా, వాళ్లలో ఈమెకున్న ఆకర్షణ ఏది?

అతణ్ణి తుల్య గమనించింది. కాని గమనించనట్టే తన క్లాసకి వెళ్తోంది. అతను బలవంతంగా రెండడుగులు ముందుకేశాడు. మనసు నీటిలో మొసలయింది.

పక్క రూంలో తెలుగు లెక్చరర్ ఓ ప్రబంధ కన్యను రొమాంటిక్ వర్ణనలతో క్లాస్ టాపు లేపేస్తున్నాడు. నూనూగు మీసాల కుర్రాళ్ల తలలు బద్దలుగొట్టేస్తున్నాడు శృంగారమనే సుత్తితో.

నల్లత్రాచులా మిసమిసలాడుతూ నాట్యం చేస్తున్న ఆమె జడ, ఆ జడలో ఆమె శరీరచ్ఛాయలో వున్న నవనవలాడే గులాబీ, మరికొంచెం కిందికి చూస్తే గుండ్రని నడుమూ, నడకలో ముగ్ధమనోహర లాస్యం... అతనికే వెర్రెత్తిపోతోంది, క్లియోపాత్రా తన ముందుకు వచ్చి వాలినట్టు.

విశ్వనాథరావు రూంకెలా వెళ్లాడో తనకే తెలియదు. రైజయ్యిన బీపీతో మూడీగా కూర్చుండిపోయాడు.

"సార్! మీకోసమెవరో వచ్చారు" అన్నడు ప్యూన్ పాపారావు వచ్చి.

అతను చాలాసేపు బ్లాంక్ అయ్యాడు.

కడకు తనకు తానే కొండంత స్టెబిలిటీని తెచ్చుకుని బయట వెయిట్ చేస్తున్నవాళ్లని రమ్మని పిలిపించాడు.

ముగ్గురు యువకులు, ఓ యువతి లోపలికొచ్చారు. ఆ యువతికి వయసు ముప్పై కావొచ్చు కాని నలభై వచ్చేసినట్టు కాస్ట్లీ మేకప్ వాడింది. స్లీవ్‌లెస్ బ్లౌజ్‌లోంచి ఆమె తన అందాల్ని బయటకు కనిపించేందుకు చేసిన ప్రయత్నం వెగటుగా వుంది. అస్సామీలా చిన్ని ముక్కు, మిజోలకుండేట్టు పెద్ద నుదురు, ఆఫ్రికన్‌లా పెద్ద పెదాలు. ఈమెకు, తుల్యకు రూపంలో ఎంత బేధం అనుకున్నాడు విశ్వనాథరావు భార్య అందాల్ని తలుచుకుంటూ.

"మేము మన టౌన్లో బ్యూటీ పార్లర్ ప్రారంభించాలనుకుంటున్నాం. అందుకు మీ శ్రీమతి తుల్యగారిని గౌరవాధ్యక్షురాలిగా వుండాలని కోరుకుంటున్నాం" అందులో ఓ యువకుడు పారపళ్లు బయటపెట్టి అడిగాడు.

అతని కుడిచేతిలో పేపర్ వెయిట్ బిగుసుకుంది. అతని కోపమంతా దానిమీద కేంద్రీకరించి, మెల్లిగా మనిషయ్యాడు.

"మీరెవరైనా సినిమా య్యాక్ట్రెస్‌ని చూసుకోవలసింది" అన్నాడు అతను ఒళ్లుమంటతో.

"మొత్తం సినీఫీల్డ్ వెదికినా తుల్యగారి లాంటి గ్లామరస్ లేడీ ఎక్కడున్నారండీ? మేమే ఆమె లవ్వులో పడిపోతుంటాము" అంది ఆ యువతి వంకర్లు తిరిగిపోతూ.

కాలేజీలో కుర్రాళ్లు అనేకసార్లు గోడలమీద రాసేరు 'తుల్య-ఎవర్ గ్రీన్ బ్యూటీ' అని.

విశ్వనాథరావు వాళ్లకేదో కఠినంగా చెప్పి పంపించేశాడు.

★ ★ ★

ఇరవై ఐదేళ్లు వెనక్కి వెళ్లాయి అతని ఆలోచనలు. అప్పుడు తుల్య తన క్లాస్‌మేట్. ఆమె అందానికి అంతా సమ్మోహితులయ్యేవారు.

హిస్టరీ లెక్చరర్, ఆ ముసలి పీనుగ సహితం ఎంత ఆశగా చూసేవాడు ఆమె వంక. ఇప్పుడు అర్థమవుతుంది అందంలో గల మహిమ. కీట్స్ పొయిట్రీ అంతా ఆడదాని గురించీ, అందాన్ని గురించే కదా!

ఎవ్వరికీ దక్కని సౌందర్య గని తనకు దక్కింది. దాని కోసం ఎంత శ్రమించాడు. ఎంత త్యాగం చేసుకున్నాడు.

★ ★ ★

మెల్లగా ఇంటికెళ్లాడు విశ్వనాథరావు. అతని ఆలోచనలకి హై ఫీవరొచ్చింది.

కాసిని మెతుకులు తిని మంచంలో పడ్డాడు.

ఆమె అప్సరసలా తయారయ్యి బెడ్‌రూంకొచ్చింది.

అతనామెను ఓరకంట చూశాడు.

ఉదయం సాంఘిక బాధ్యత గల సమాజంలో ఓ స్త్రీ- కాలేజీలో విజ్ఞానం పంచే సరస్వతి- ఇప్పుడు సంసార స్వర్గంలో సకల ఐహిక సుఖాలకూ ఆద్యంతాలు చూపించే రంభ.

అతను అటు తిరిగి పడుకున్నాడు.

తుల్య వెళ్లి భర్త మీద చెయ్యి వేసింది. ఆకాశం మీంచి దిగివచ్చిన ఫెయిరీలా అతని గడ్డం మీద వేలు వేసి ఇటు తిప్పి, ఏమిటి సంగతన్నట్టు నక్షత్రాలు నిండిన కళ్లతో వలపుగా ప్రశ్నించింది. అతనామె చెయ్యి తీసేసి ముభావంగా వుండిపోయాడు.

ఆమె గాఢంగా నిట్టూర్చి మరో పక్కమీద పడుకుంది. రసికత్వం, శృంగారం ఆ రాత్రి నీళ్లు కారిపోయాయి.

ఉదయం అతను టిఫిన్ తింటూ ధుమధుమలాడుతున్నాడు. మాట్లాడకపోతే బావుండదని "ఏంటండి అలాగున్నారు?" అడిగింది తుల్య.

"ముసలితనం ముదిరేకొద్దీ మేకప్ కూడా పెరుగుతుంది" అన్నాడు కడకు తెగించి.

ఆ మాట ఆమె మీద బాంబులా బ్లాస్టయింది.

'మొత్తం మీద నువ్వూ మొగాడివే అనిపించుకున్నావ్' అనుకుంది లోలోన.

రెండ్రోజులు గడిచాయి.

ఓ రోజున "నీ మేకప్ సామానుకి నెలసరి ఖర్చు ఎంత?" ప్రశ్నించాడు.

"మీరు తాగే సిగరెట్ల ఖర్చులో వన్ బై ఎయిత్, అది కూడా నా సంపాదనలోదే" చాచి లెంపకాయ కొట్టినట్టుందామె జవాబు.

"పొద్దున్నే ఆ స్ప్రింగ్ లాగటం, వ్యాయామం చెయ్యడం ఇంకా ఎందుకు చంటిపిల్లలా, ఎవరైనా చూస్తే నవ్వుతారు"

"ఆరోగ్యం కాపాడుకోవడానికి వయోపరిమితి లేదు. ఆరోగ్యమే అందం. గాలి, వెలుతురు, నీరు ఎంత అవసరమో ఇదీ అంతే. కావాలంటే మీరు కూడా నాతో పాటు వ్యాయామం చెయ్యండి" అంది తుల్య.

ఇద్దరి మధ్యా గొడవ లేచి పెట్రోలు మంటలా భగ్గుమంది. "తుల్యా! ఇంత వయసొచ్చినా నీకీ మేకప్పేమిటి... నువ్వేమన్నా సినిమా య్యాక్ట్రెస్‌వా, లేక క్లబ్బులో దొరికే హైక్లాస్ కాల్‌గర్ల్‌వా?" అన్నాడు వైల్డ్‌గా.

బీరువాలో వున్న కీట్స్ పొయిట్రీ టెక్స్ట్ తీసుకుని బయటకు నడవబోతుంటే-

"మిస్టర్ విశ్వనాథరావ్, స్టే దేర్" గర్జించిందామె.

గన్ పేలి తూటా గుండెల్లోంచి దూసుకుపోయినట్లనిపించింది అతనికి.

"ఇరవై అయిదు సంవత్సరాల క్రితం నా వెనక పిచ్చెక్కి మీరు ఎందుకు పడ్డారో చెప్పగలరా? ఎన్ని వందల ఉత్తరాలు నా అందాన్ని వర్ణిస్తూ రాశారో గుర్తుందా? కాని అప్పట్లో అనేక వందల అమ్మాయిలు కూడా మీతో చదువుతూ వుండేవారు. వాళ్లందరికీ ఇలా ఉత్తరాలు రాసి ప్రేమంటూ రేయింబవళ్లు పరుగెత్తారా? నాకోసం మీరు మీ కుటుంబాన్ని సహితం త్యజించి వచ్చారంటే నాలో మీరు చూసిందేమిటి? కొంత అందం, మరికొంత గ్లామర్, అంతే కదూ?... అందం వయసుతో పాటు తరుగుతుంది. అది సాధ్యమైనంతవరకూ నిలుపుకోలేకపోతే మీ మగబుద్ధి మారే ప్రమాదం వుంది. చిరకాలం మన సంసారం గ్లామరస్‌గా వుండాలంటే కేవలం హృదయంలో వుండే ప్రేమ ఒక్కటే చాలదు, నా గ్లామర్ కూడా కాపాడుకునే అవసరముందని నాకు తెలుసు. ఈ సూత్రం స్త్రీలకే కాదు, పురుషులకి కూడా వర్తిస్తుందని వేరే చెప్పనవసరం లేదనుకుంటాను" అని తుల్య చెప్పేసరికి అతనిక ఏమీ జవాబు చెప్పలేకపోయాడు.

**-బద్దిగం పాండురంగారెడ్డి (కరీంనగర్)**